సాక్షి ప్రకాశం
గురువారం । 20 । జూలై । 2023



తోడేళ్ల గుంపును తరిమికొట్టండి
ఎన్నికలు సమీపిస్తుండటంతో రాష్ట్రంపై తోడేళ్ల గుంపు విరుచుకుపడుతోందని వారిని తరిమికొట్టాలని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రైతులకు భరోసా
వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రైతులకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే టీజేఆర్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/27

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షంపడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రి క్యాంపు కార్యాలయం ప్రారంభం



క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

మార్కాపురం: రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ బుధవారం పట్టణంలోని చెన్నకేశవనగర్ లో నూతన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు నూతన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, పెద్దారవీడు మండల కన్వీనర్ పీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించం

● కలెక్టర్ దినేష్‌కుమార్



పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు సంబంధించిన విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ప్రకాశం భవనంలో ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు వెంటనే సంబంధిత శాఖలకు అప్పగించాలన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలకు వారంతపు లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇచ్చిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో తప్పనిసరిగా పూర్తి చేయాలని అన్నారు. డీఈ, ఏఈలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, డీఈఈ, ఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

ఒంగోలుకు చేరిన వీవీ ప్యాట్స్

ఒంగోలు అర్బన్: స్థానిక భాగ్యనగర్ ఈవీఎం గోదాముకు బెంగళూరు బెల్ కంపెనీ నుంచి 6390 వీవీ ప్యాట్‌లు వచ్చాయి. బుధవారం వచ్చిన వీవీ ప్యాట్‌లను ఎన్నికల విభాగం అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాటిని గోదాములో భద్రపరిచారు. ఈ వివి ప్యాట్స్ రాబోయే సాధారణ ఎన్నికల్లో ఉపయోగించనున్నారు. దీనిలో ఎలక్షన్ డీటీ రఫీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు దామరాజు క్రాంతికుమార్, గుర్రం సత్యనారాయణ, రాజశేఖర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.


యువతి ప్రాణాలు కాపాడిన పోలీసులు

ఒంగోలు టౌన్: వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువతిని సకాలంలో స్పందించిన పోలీసులు ప్రాణాలు రక్షించారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఒంగోలుకు చెందిన 20 ఏళ్ల యువతి వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు 112కు ఫోన్‌కాల్ రావడంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. పోలీసు కంట్రోలు రూం సిబ్బంది వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి ఐటీ కోర్ టీం సహకారంతో యువతి ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. అక్కడికి చేరుకొని అప్పటికే ఎలుకల మందు తాగి ఉన్న ఆ యువతిని రిమ్స్‌కు తరలించారు. అనంతరం యువతి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. వారికి ఆ యువతిని అప్పగించారు. తమ బిడ్డ ప్రాణాలు కాపాడిన పోలీసులకు యువతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించి యువతి ప్రాణాలు కాపాడిన వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ అరుణ్ కుమార్, ఐటీ కోర్ ఎస్ఐ అజయ్ కుమార్ తదితరులను ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు.



యువతికి చికిత్స చేస్తున్న వైద్యులు

యువగళం... తలోదారి



యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర జిల్లాలో టీడీపీలో జోష్ నింపక పోగా గ్రూపు తగాదాలు.. అంతర్గత విభేదాలు వెలుగుచూస్తున్నాయి. ఇంత వరకూ జిల్లాలో గుంభనంగా ఉన్న నేతల మధ్య నెలకొన్న గ్రూపు తగాదాలు, కుమ్ములాటలు తారస్థాయికి చేరుకున్నాయి. పాదయాత్ర సాగుతున్న కొండపి, కనిగిరి నియోజకవర్గాల్లో చాలా మంది సీనియర్ నేతలు దుమ్మా కొట్టారు. ఈ విషయంలో పార్టీ అధిష్టానం వ్యవహరిస్తున్న తీరు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఈవినింగ్ వాక్‌గా సాగుతున్న యాత్రను నడిపించేందుకు అష్టకష్టాలు పడుతున్నామని ఆ పార్టీ నేతలే అంటున్నారు.

- లోకేష్ పాదయాత్రలో వర్గాలుగా విడిపోయిన టీడీపీ నేతలు
- కొండపి, కనిగిరి నియోజకవర్గాల్లో తారస్థాయికి గ్రూపు కొట్లాటలు
- పాదయాత్రకు స్పందన అంతంత మాత్రమే
- సాయంత్రం వాకింగ్‌లా సాగుతున్న వైనం
- టీడీపీ కార్యకర్తలతోనే ముఖాముఖి కార్యక్రమాలు

సాక్షిప్రతినిధి, ఒంగోలు: చంద్రబాబు తనయుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి ప్రకాశం జిల్లాలోకి అడుగుపెట్టినప్పటి నుంచి టీడీపీ నాయకులు గ్రూపులుగా విడిపోయారు. ముఖ్యంగా కొండపి, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో అంతర్గత కుమ్ములాటలు తారస్థాయికి చేరాయి. ఈ నెల 15వ తేదీ సాయంత్రం కందుకూరు నియోజకవర్గంలోని లింగసముద్రం మండలంలోకి ప్రవేశించిన లోకేష్ యువగళం పాదయాత్ర సాయంత్రం వాకింగ్ మాదిరిగా సాగుతోంది. ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి మాత్రమే పాదయాత్ర ప్రారంభమవుతోంది. రాత్రి 10 నుంచి 11 గంటల వరకు సాగుతూనే ఉంటుంది. ముందుగా చేసుకున్న ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేస్తున్న ఒకటి, రెండు చోట్ల ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కొండపిలో అసమ్మతి నేతల దూరం..

కొండపిలో టీడీపీ ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి పోకడలపై పార్టీలోని నేతలే విమర్శిస్తున్నారు. ఆయన సొంత మండలం టంగుటూరులోనే మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు ఇప్పటికే పార్టీకి దూరంగా ఉన్నారు. ఎలాంటి పార్టీ కార్యక్రమాల్లో కూడా ఆయన కానీ ఆయన వర్గం నాయకులు కానీ పాల్గొనటం లేదు. ఇకపోతే రెండో అతిపెద్ద వర్గంగా ఉన్న బెల్లం జయంత్ బాబు వర్గం కూడా దూరంగానే ఉంటోంది. ఆ రెండు గ్రూపులను పిలిచి మాట్లాడదామన్న ఆలోచన కూడా పార్టీ అధిష్టానం చేయలేదు. ఇకపోతే కొండపి, సింగరాయకొండ, పొన్నలూరు, జరుగుమల్లి, మర్రిపూడి మండలాల్లో కూడా పార్టీలో వర్గాల కుమ్ములాటలు తారస్థాయిలోనే ఉన్నాయి. కాకపోతే అధికారంలో లేముకదా ఎందుకులే బయట పడటం అనుకొని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇకపోతే కనిగిరి టీడీపీలో కొత్త, పాత వర్గాల మధ్య వివాదాలు భగ్గుమంటున్నాయి. ఇదిలా ఉండగా కొండపి నియోజకవర్గం పొన్నలూరులో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభకు ప్రజలను తీసుకువెళ్లే క్రమంలో జరుగుమల్లి మండలం ఎన్ఎన్ కండ్రిక గ్రామ ప్రధాన సెంటర్లో టీడీపీలో ఇరువర్గాల వారు దాడికి పాల్పడ్డారు. టీడీపీ నాయకులు గాలి బ్రహ్మయ్య, పావులూరి చిన కోటేశ్వరరావు విడివిడిగా జనాలను తరలించే క్రమంలో ఘర్షణ తలెత్తి ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేసుకున్నారు. గాయపడిన వారు ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలవారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు రిజిస్టరు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక కనిగిరి నియోజకవర్గంలో మొదటి నుంచి పార్టీని అంటిపెట్టుకొని, పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడిన ఆ పార్టీకి చెందిన పాత నేతలను కాదని, కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత ఇస్తుండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఉగ్ర సేన పేరుతో నియోజకవర్గంలో ఉగ్ర అనుచరులు చెలరేగిపోవటంతో మొదటి నుంచి పార్టీకి సేవ చేసిన వారు రగిలిపోతున్నారు. పార్టీలోని పాత నాయకులకు ప్రాధాన్యత అధిష్టానం తగ్గిస్తోందంటూ మండిపడుతున్నారు. అందుకే మంగళవారం సాయంత్రం యువగళం లోకేష్ కనిగిరి నియోజకవర్గంలోకి అడుగు పెడితే పాత, కొత్త నేతలుగా విడిపోయి స్వాగతం పలికారు. కొందరు సీనియర్ నాయకులైతే లోకేష్ పాదయాత్ర వైపు కన్నెత్తి కూడా చూడలేదంటే వారి మధ్య ఏ స్థాయిలో అసంతృప్తి ఉందో అర్థమవుతోంది.

అంబులెన్స్‌కు దారివ్వని నేతలు

పీసీపల్లి: అలవలపాడులో ముఖాముఖి అనంతరం లోకేష్ పాదయాత్ర జరుగుతుండగా అలవలపాడు, హాజీస్‌పురం రోడ్డు మధ్యలో అంబులెన్స్ రోగులతో వస్తుండగా దానికి దారి ఇవ్వలేదు. పాదయాత్రలో లోకేష్‌తో నాయకులు ఉగ్ర నరసింహారెడ్డి, గొట్టిపాటి రవి, ముత్తుముల అశోక్‌రెడ్డి తదితర నాయకులు ఉన్నా కూడా అంబులెన్స్‌కు దారిద్దామని కానీ..రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలనే ప్రయత్నం చేయకపోవడం టీడీపీ కార్యకర్తలను కూడా ఒకింత విస్మయానికి గురిచేసింది. యాత్రలో మద్యం ఏరులై పారింది. అలవలపాడు, రామాపురం, బండ్లపురం, హాజీస్‌పురం వద్దకు రాగా 2001 కి.మీ పాదయాత్ర జరిగినందుకు గుర్తుగా శిలాఫలకం వేశారు. ఇదిలా ఉండగా తక్కువ మందికి భోజనాలు ఏర్పాటు చేసి ఎక్కువ మందిని తీసుకు రావడంతో వాగ్వాదాలు జరగడం కొసమెరుపు.



అంబులెన్స్‌కు దారివ్వని యువగళం పాదయాత్ర (చిత్రంలో లోకేష్, ఉగ్ర, గొట్టిపాటి)


ఇవిగో ప్రశ్నలు..అడగండిక!

- ముఖాముఖికి ముందస్తు ప్రణాళిక
- వలస కార్మికుల మునుగులో టీడీపీ నేతలు
- లోకేష్ మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన మహిళలు

పీసీపల్లి: యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ముఖాముఖీ కార్యక్రమం ప్రహసనంగా సాగుతోంది. ఈ కార్యక్రమంలో ఎవరెవరు పాల్గొనాలి.. ఎవరు ఏ ప్రశ్న అడగాలి.. ఏమి మాట్లాడాలి.. అంతా ముందుగానే కార్యకర్తలను సిద్ధం చేస్తున్నారు. ముఖాముఖీ ప్రారంభం కాగానే వారు జనంతో కలసి పోతారు.. ప్రజలు అడుగుతున్నట్టుగా ప్రశ్నలు అడుగుతారు.. దానికి లోకేష్ సమాధానమిస్తున్నారు. బుధవారం పీసీపల్లి మండలం పెద్ద అలవలపాడులో మధ్యాహ్నం 12 గంటలకు వలస కార్మికులతో నారా లోకేష్ ముఖాముఖీ కార్యక్రమం జరిగింది. లోకేష్‌తో ఎవరెవరు మాట్లాడాలి.. ఏమి మాట్లాడాలి అనే దానిపై టీడీపీ ముఖ్య నాయకులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రశ్నలు అడిగేందుకు కార్మికులతో పాటు కొంత మందిని ఎంపిక చేశారు. ప్రాంగణంలో అక్కడక్కడా కూర్చొబెట్టి ప్రశ్నలు అడిగించారు. ఏ ప్రశ్నలు అడుగుతారో అనేవిషయాన్ని ముందుగానే లోకేష్‌కు వివరించారు. ఆ ప్రకారమే ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ముఖాముఖి జరుగుతుండగానే లోకేష్ మాట్లాడుతున్న తీరుతో విసిగిన మహిళలు కార్యక్రమం జరుగుతుండగానే వెనుదిరిగారు. ఇదిలా ఉండగా పాదయాత్రలో పాల్గొన్న మహిళలకు చీరలు పంచిపెట్టినట్లు తెలిసింది.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటి సర్వే
- నకిలీ, డోర్ నంబర్ తప్పిదాలు సరిచేస్తాం
- అన్నీ రాజకీయ పార్టీల సహకారంతో ఓటర్ల జాబితా
- ఎన్నికలకు సంబంధించిన విధులకు వలంటీర్ల ప్రమేయం లేకుండా చర్యలు
- విలేకర్ల సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్



రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఎటువంటి లోపాలు, పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు రూపొందించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీలతలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓ)లతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు గత నెల 1 నుంచి ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ, బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇంటింటి సర్వే తర్వాత ఆగస్టు 22వ తేదీ నుంచి 29 వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఓటరు గుర్తింపు కార్డులోని ఫొటోలు, చిరునామాల్లో తేడాలను సవరిస్తామన్నారు. అనుబంధ జాబితాలతో కూడిన సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా తయారీపై సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకు దృష్టి సారిస్తామన్నారు. డిసెంబర్ 26 నాటికి ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరించి వచ్చే ఏడాది జనవరి 5వ తేదీ తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామన్నారు. పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారు చేసేందుకు ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల మేరకు నిర్దిష్ట గడువులోపు ప్రక్రియ పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగాన్ని సమాయత్తం చేశామన్నారు. దానిలో భాగంగానే జిల్లాలోని 2178 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో 18 సంవత్సరాలు నిండిన వాళ్లను ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని కలెక్టర్ కోరారు. 17 ఏళ్లు నిండిన వారిని కూడా భవిష్యత్తు ఓటర్లుగా గుర్తిస్తామన్నారు. ప్రత్యేక మొబైల్ యాప్‌తో సర్వే నిర్వహిస్తారన్నారు. డబుల్‌ఎంట్రీలు, చనిపోయిన, వలస వెళ్లిన వారిని గుర్తించి ఓటర్ల జాబితాలో పేర్లను తొలగిస్తామన్నారు. ఇంటి నంబర్లలో జీరో, జంక్, తదితర లోపాలు లేకుండా మొబైల్ యాప్ ద్వారా అప్‌డేట్ చేస్తామన్నారు. ఇంటి నంబర్ల ఆధారంగా వరుసగా ఓటర్ల జాబితా రూపొందిస్తామన్నారు. కుటుంబ సభ్యులను వేరు చేయకుండా జాబితాలో వరుసగా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను కలెక్టర్ కోరారు. సర్వేకు సంబంధించి షెడ్యూల్‌ను రాజకీయ పార్టీలకు ఈఆర్‌ఓలు తెలియచేస్తారన్నారు.

జగనన్న సురక్షలో రికార్డు స్థాయిలో సర్వీసులు

జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లాలో రికార్డు స్థాయిలో సర్వీసులు ప్రజలకు అందించామన్నారు. 16 క్యాంపులకు ఇప్పటికి 10 క్యాంపులు పూర్తి చేశామని చెప్పారు. దీనిలో 6,41,253 ఇళ్లకు వెళ్లి వారి అవసరాలను గుర్తించి ప్రభుత్వం తరపున అవసరమైన సర్టిఫికెట్లు, సేవలు అందించామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 3,77,210 సేవలు అందించినట్లు తెలిపారు. మూడు వారాల వ్యవధిలో ఇన్ని సేవలు అందించడం గొప్ప రికార్డు అని తెలిపారు. జగనన్న సురక్ష క్యాంపులో ప్రత్యేకంగా జగనన్నకు చెబుదాం డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సవరణ, ఇంటింటి సర్వే అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్డీవో అజయ్‌కుమార్, ఇతర అధికారులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషా, రాజశేఖర్, రసూల్, రమేష్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను విస్మరించే ప్రభుత్వాలు మనలేవు



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- వ్యవసాయాన్ని పండుగగా మార్చిన జగనన్న
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రైతులను విస్మరించే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని, గతంలో 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా అనుభవం ఉన్న చంద్రబాబు వ్యవసాయం దండగని, రైతులను చిన్న చూపుచూశారని, ఆయన్ను ప్రజలు అడ్రస్ లేకుండా చేశారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.66.13 లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వై.ఎస్.ఆర్. ఇంటిగ్రేటెడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. 2014 జరిగిన ఎన్నికల ముందు రైతుల రుణాలను మాఫీ చేస్తామని టీడీపీ వాగ్దానం చేసిందని, అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అనేక ఆంక్షలుపెట్టి రైతులను మోసం చేశాడని విమర్శించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని వసతులు సమకూర్చి రైతు పక్షపాతిగా నిలిచారని, వ్యవసాయాన్ని పండుగ చేసుకునేలా తీర్చిదిద్దారని చెప్పారు. రైతులకు అన్ని వసతులు అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతో గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్లో వస్తున్న కల్తీలను వెంటనే తెలుసుకునేందుకు నియోజకవర్గానికి ఒక టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.55 కోట్లతో 50 ప్రయోగశాలలను నిర్మించారని అన్నారు. రైతు సాధికారత సాధించాలంటే తిరిగి జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తవుతుందని భరోసా ఇచ్చారు. ముందుగా రూ.30 లక్షల విలువైన డ్రిప్‌లను మంత్రి 20 మంది రైతులకు పంపిణీ చేశారు. రూ.21 లక్షలతో నిర్మించిన ఆర్బీకేని ప్రారంభించారు. అనంతరం ఉచిత పంటల బీమా పథకం కింద రైతులకు రూ.7.54 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. పుల్లలచెరువు మండలంలోని ఉమ్మడివరం, రాచకొండ గ్రామాల్లో ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.7 లక్షల ప్రకారం చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

కార్యక్రమంలో జేడీఏ ఎస్.శ్రీనివాసరావు, డీఎల్‌డీవో బి.వి.ఎన్.సాయికుమార్, పీఆర్ డీఈ బి.సుబ్బారెడ్డి, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఏడీఏ కె.నీరజ, టెక్నికల్ ఏవోలు బి.శ్రీనివాసరావు, ఎస్.కాంచన, ఏవోలు కె.వి.శేషారెడ్డి, కె.నిర్మల, డి.జవహర్ నాయక్, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు పాల్గొన్నారు.




రైతులకు బీమా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ఏసీబీ వలలో ఎస్సై, కానిస్టేబుల్

కొనకనమిట్ల: ఘర్షణ కేసులో నిందితులుగా పేర్లు లేకుండా చేయాలంటే డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేసి రూ.45 వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు కానిస్టేబుల్, ఓ మహిళా ఎస్సై. కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం జరిగిన ఘటనకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ పి.శ్రీనివాసులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొనకనమిట్ల మండలంలోని కాట్రగుంట ఎస్సీ కాలనీకి చెందిన జల్లి చిన్న చెన్నయ్య, అంజలి భార్యభర్తలు. మే నెల 20వ తేదీ వీరి మధ్య వివాదం జరిగింది. మధ్యవర్తిగా బంధువు అయిన గొట్టిముక్కల నరసింహులు సర్దిచెప్పారు. ఈక్రమంలో చెన్నయ్య కొట్టడంతో అంజలికి గాయాలయ్యాయి. అంజలి తరపున పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంజలి తన భర్తతో పాటు, గొట్టిముక్కల నరసింహారావు, జిల్డి కేశవులు, జల్లి మాచర్ల అనే వారిపై కేసు పెట్టింది. మే 20వ తేదీన కేసు నమోదు చేసిన ఎస్సై దీపిక విచారణ జరిపి అంజలి భర్త చెన్నయ్యను మే 31వ తేదీ రిమాండ్‌కు పంపించారు. మిగిలిన ముగ్గురికి కొట్లాటతో సంబంధం లేదని గ్రామస్తులు విచారణ సందర్భంగా పోలీసులకు చెప్పారు. దీనిని నమోదు చేసుకుని, వారిపై కేసులేనట్లుగా రికార్డుల్లో పోలీసులు నమోదు చేశారు. అయితే ఈ విషయం కేసులో పేర్లు ఉన్న పై ముగ్గురికి తెలియకుండా, మీ మీద కేసు లేకుండా పేర్లు తీసి వేయాలంటే రూ.60 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యవర్తి ద్వారా రూ.45 వేలకు బేరం కుదుర్చుకున్నారు. తాను అందుబాటులో లేకుంటే, కానిస్టేబుల్‌కు ఇవ్వాలని ఎస్సై దీపిక చెప్పారు. గొట్టిముక్కల నరసింహులు అనే వ్యక్తి లంచం ఇవ్వటం ఇష్టం లేక ఏసీబీ అధికారులను సంప్రదించారు. కేసు నమోదు చేసుకున్న ఏసీబీ డీఎస్పీ సూచనల మేరకు ఫిర్యాది గొట్టిముక్కల నరసింహులు.. కానిస్టేబుల్ నరసింహకు రోడ్డుపై రూ.45 వేలు ఇస్తుండగా మాటు వేసి పట్టుకున్నారు. ఎస్సై దీపికను కూడా అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. దాడుల్లో ఏసీబీ సీఐలు అపర్ణ, టీవీ.శ్రీనివాస్, సీహెచ్.శేషు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసులు



పట్టుబడిన నగదు, ఎస్సై దీపిక, కానిస్టేబుల్ నరసింహ

క్లుప్తంగా

సహకార సంఘం సీఈఓ సస్పెండ్

● రూ. 39 లక్షల అవకతవకలకు పాల్పడినట్లు గుర్తింపు


మాట్లాడుతున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కందుల వెంకటేశ్వర్లు

కొమరోలు: స్థానిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో సీఈఓ ఆర్.దిలీప్‌కుమార్ నిధుల దుర్వినియోగం, ఆర్థిక పరిపాలన పరమైన అవకతవకలకు పాల్పడినట్లు రుజువు కావడంతో సస్పెండ్ చేసినట్లు పొదిలి సబ్‌డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కందుల వెంకటేశ్వర్లు తెలిపారు. వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో రైతులు, గిద్దలూరు పీడీసీసీ బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు తనను విచారణ అధికారిగా పంపించినట్లు తెలిపారు. కొంతకాలంగా 40 మంది రైతులను విచారణ చేపట్టగా దిలీప్‌కుమార్..అప్పు జమ చేసేందుకు రైతుల వద్ద నగదు తీసుకొని బ్యాంక్‌లో జమ చేయకుండా మళ్లీ రైతులకు రుణం మంజూరు చేశాడని తెలిపారు. ఇప్పటి వరకు 40 మంది రైతులకు దాదాపు రూ.39 లక్షల వరకు మోసం చేసినట్లు గుర్తించామన్నారు. అదే విధంగా సజ్జలు, జొన్నలు కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి గింజలను కొనుగోలు చేసి వారికి ప్రభుత్వ గిట్టుబాటు ధరను కూడా కొంతమంది రైతులకు ఇవ్వలేదన్నారు. వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సూపర్‌మార్కెట్‌ను నిర్వహించారని, అక్కడ కూడా అవకతవకలకు పాల్పడ్డారని, రూ.4 లక్షల నగదు తేలాల్సి ఉందని తెలిపారు. తాను గురు, శుక్రవారాల్లో కొమరోలు వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని, సీఈఓ దిలీప్‌కుమార్ చేతిలో రైతులు ఎవరైనా మోసపోతే తనకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

గిద్దలూరు రూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన స్థానిక రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. నంద్యాల జీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ తెలిపిన వివరాల ప్రకారం..అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద ఓ గుర్తుతెలియని యువకుడు రైలు కదిలే సమయంలో రైలు కింద దూరినట్లు తెలిసింది. మృతుడు ఈ ప్రాంతం వాసి కానట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు.

తోడేళ్ల గుంపును తరిమికొట్టండి

● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్


లబ్ధిదారుడికి సర్టిఫికెట్ అందచేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ఎన్నికలు సమీపిస్తుండటంతో రాష్ట్రంపై తోడేళ్ల గుంపు విరుచుకుపడుతుందని, ఈ గుంపుతో ముప్పు పొంచి ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తరిమికొట్టాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో బుధవారం స్థానిక సచివాలయం-1, 2 పరిధిలోని ప్రజలకు ఏర్పాటు చేసిన జగనన్న సురక్షలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవలు అందించటానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వలంటీర్లను ప్రతిపక్షాలు వద్దంటున్నాయని, వారిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా ప్రజల్లోకి తీసుకువెళుతున్న వలంటీర్ల వ్యవస్థపై నాలుగేళ్లుగా ఆరోపణలు చేసేందుకు వీల్లేక ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతిపక్షాలు వారిపై విరుచుకుపడుతున్నారని, ఈ చర్య ప్రజలు ఏమాత్రం సహించరన్నారు. గత టీడీపీ పాలనలో ప్రజలను ఏమాత్రం పట్టించుకోకుండా ఇప్పుడు జగనన్న పథకాలను మేం కూడా అమలు చేస్తామని శుష్క వాగ్దానాలు చేస్తున్నారన్నారు. ప్రజలు గత టీడీపీ పాలన, ప్రస్తుత జగనన్న పాలనను బేరీజు వేసుకొని మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినదిస్తున్నారన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు పొందేందుకు అంగ, కుల, ఆర్థిక, రాజకీయ బలం అవసరం లేదని, కేవలం అర్హత ఉంటే చాలని పేర్కొన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందేవని, పార్టీ కండువా కప్పుకుంటేనే పింఛన్లు మంజూరు చేసిన చరిత్ర వారిదన్నారు. జగనన్న ఎన్నికల సమయంలో ఇచ్చిన 95 శాతానికి పైగా అమలు చేశారని, మిగిలిన 5 శాతం పూర్తి చేసేందుకే జగనన్న సురక్ష అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సచివాలయం- 1, 2 పరిధిలో 2,300 మందికి వివిధ రికాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం-3 భవనాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కందుల సత్యనారాయణ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, తహసీల్దార్ కె. రవీంద్రరెడ్డి, ఎంపీడీఓ వైవీ నాగేశ్వరప్రసాద్, ఈఓపీఆర్డీ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

● మంత్రి ఆదిమూలపు సురేష్
● ఐనముక్కలలో గడప గడపకు మన ప్రభుత్వం
● నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి


ఐనముక్కలలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

పెద్దదోర్నాల: రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడుకుంటూ అందరికీ సంక్షేమ పథకాలు అందేలా సుపరిపాలన చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని ఐనముక్కలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన నిర్ణయాలతో వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను నిరంతరం అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. కరోనా కష్టకాలంలోనూ ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా సజావుగా కొనసాగించారన్నారు. వైఎస్సార్ అధికారంలోకి ఉన్న సమయంలో పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చారని, ఆయన తనయుడు మరో అడుగు ముందుకు వేసి సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తున్నారన్నారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చి గ్రామీణ ప్రాంత ప్రజలకు విలువైన సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాన్ని అందజేశారు.

సచివాలయ భవనం ప్రారంభం

మండల పరిధిలోని ఐనముక్కలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు సురేష్ నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. గ్రామ సచివాలయాలు గ్రామీణ ప్రజల పేరిట ఆధునిక దేవాలయాలని ఆయన పేర్కొన్నారు. మానవ సేవయే మాధవసేవ అన్న లక్ష్యంతో ఆధునిక దేవాలయాలు నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నాయని ఆయన కొనియాడారు. సచివాలయంలో పని చేసే ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో పారదర్శకతతో పాటు జవాబుదారీతనంలో పనిచేస్తున్నారని కొనియాడారు. డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీఓ విజయ, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల ఖాశీంపీరా, జెడ్పీటీసీ దుమావత్ లతాబాయి, సర్పంచ్ చిత్తూరి హారిక, వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, మండల నాయకులు చిట్యాల యోగిరెడ్డి, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, యక్కంటి మల్లారెడ్డి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


గుండ్లకమ్మ వద్ద మరమ్మతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఈఈ నాగమురళీమోహన్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రైతులకు భరోసా

● గుండ్లకమ్మ ప్రాజెక్టును ఏనాడు పట్టించుకోని టీడీపీ
● గత ప్రభుత్వంలో సుందరీకరణ పేరుతో నిధులు నొక్కేసిన టీడీపీ నేతలు
● ప్రాజెక్టు 12 గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తాం
● ఖరీఫ్‌లో పంట వేయవద్దని టీడీపీ విషప్రచారాన్ని నమ్మొద్దు
● ప్రాజెక్టులో పుష్కలంగా నీరు
● రెండు మూడు రోజుల్లోనే ఆరో గేటుకు మరమ్మతులు పూర్తి
● ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: వ్యవసాయం దండగ చంద్రబాబు నినాదమైతే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండగ చేసి చూపారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్ల మరమ్మతులు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రిజర్వాయర్‌లో గేటు కొట్టుకుపోవడం అకస్మాత్తుగా జరిగింది కాదని, దీనికి గత టీడీపీ ప్రభుత్వ బాధ్యత ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో రిజర్వాయర్ మెయింటెనెన్సుకు అరకొర నిధులు విదిల్చి..ఆ నిధులు కూడా రిజర్వాయర్ సుందరీకరణ పేరుతో పార్టీ నాయకులు మింగేశారన్నారు. మరమ్మతులు లేకపోవడంతో గత ఏడాది మూడవ గేటు గడ్డర్ ఊడిపోయిందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 12 గేట్లకు మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, విషయాన్ని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సహృదయంతో వెంటనే రూ.9.40 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ప్రతి రిజర్వాయర్‌కు ఒక్క గేటుకు సరిపడ మాత్రమే స్టాప్‌లాక్‌లు ఉంటాయని, కానీ గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో రెండు గేట్లకు సరిపడా 12 స్టాప్‌లాక్‌లు ఉండడంతో మరమ్మతులు చేయాల్సిన 5,6వ గేట్లకు స్టాప్‌లాక్ అమర్చిన క్రమంలో మూడవ గేటుపై ఒత్తిడి పెరిగి విరిగిపోయిందన్నారు. ప్రస్తుతం 6వ గేటు మరమ్మతులు రెండు రోజుల్లో పూర్తి కానుందని, వెంటనే మూడవ గేటుకు స్టాప్‌లాక్‌లు అదనంగా ఏర్పాటు చేసి నీరు నిల్వ చేసే ప్రక్రియ అధికారులు ప్రారంభిస్తారన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రిజర్వాయర్‌లోని 12 గేట్లకు రెండు మూడు నెలల్లో మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. ఖరీఫ్‌లో పంటలు వేయవద్దని టీడీపీ నేతలు, విపక్షాలు విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రిజర్వాయర్‌లో ఇప్పటికే 1.18 టీఎంసీల నీరు ఉందని, ఖరీఫ్ నాటికి ఈ నీరు పుష్కలంగా అందిస్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో రిజర్వాయర్‌లో మరింతగా నీరు నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముఖ్యమంత్రిని విమర్శించేందుకే లోకేష్ పాదయాత్ర

ఈ సందర్భంగా లోకేష్ పాదయాత్ర గురించి విలేకరులు ప్రశ్నించగా..లోకేష్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నాడో ఆయనకే అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడని లోకేష్ ఎంత సేపు ముఖ్యమంత్రిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఎల్లో మీడియా ద్వారా తనను తాను హైప్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు తప్ప మాట్లాడుకోవాల్సింది ఏం లేదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మా ఎమ్మెల్యేలంతా నిమగ్నమై ఉన్నారని, మాకు లోకేష్ పాదయాత్ర గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఒంగోలులో జూనియర్ ఎన్టీఆర్ పేరుతో ఫ్లెక్సీల గురించి ప్రస్తావించగా..దామచర్ల జనార్దన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని,తాము అధికారంలో ఉండి భవిష్యత్‌లో వేరే వ్యక్తి ముఖ్యమంత్రి అవుతాడని ఎవరైనా చెబుతారా అంటూ ప్రశ్నించారు. ఆ ఫ్లెక్సీల విషయంలో వైఎస్సార్ సీపీపై నిందలు వేయడం దామచర్ల జనార్దన్ అవివేకమన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట గుండ్లకమ్మ రిజర్వాయర్ ఈఈ నాగమురళీమోహన్, భారత పొగాకు బోర్డు మెంబర్ మారెడ్డి సుబ్బారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గట్టినేని అయ్యన్న, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు నర్రా సురేష్, కోయి హనుమయ్య, పోలవరపు శ్రీమన్నారాయణ, సన్నపు రెడ్డి రమణమ్మ, మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, నేతలు పాల్గొన్నారు.

మట్కా జూదరుల అరెస్టు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయ వెనుక వీధిలోని ఓ గృహంలో మట్కా ఆడుతున్న ఏడుగురు జూదరులు, నిర్వాహకుడిని మార్కాపురం సెబ్ ఏఈఎస్ ఏ శ్రీనివాసనాయుడు, సీఐ అరుణకుమారి బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద రూ.18 వేలు స్వాధీనం చేసుకున్నారు.

యువకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కొండపి: మండలంలోని కట్టావారిపాలెం-2 సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యువతిని వేధిస్తున్న యువకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఎస్సై రమణయ్య వివరాల మేరకు.. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు తన్నీరు మనోజ్ వేధిస్తూ విధులకు ఆటంక పరుస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పృథులగిరి సత్రాల్లో చోరీ

మర్రిపూడి: మండలంలోని పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి కొండపై ఏర్పాటు చేసిన సత్రాల్లో దుండుగలు చోరీకి పాల్పడ్డారు. కొండపై ఉన్న ఆర్యవైశ్య సత్రంలో కొన్ని విద్యుత్ ఉపకరణాలు, బ్రాహ్మణ అన్నదాన సత్రంలో విద్యుత్ మోటర్, విశ్వబ్రాహ్మణ సత్రంలో వంటపాత్రలు, గ్యాస్ పొయ్యిలు, కమ్మ సత్రంలో విద్యుత్ వైర్లు, బల్బులు దొంగిలించారు.

యువగళం అట్టర్ ఫ్లాప్


మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

● రెండు రోజుల పాదయాత్రలో ప్రజల నుంచి స్పందన కరువు
● జిల్లా నలుమూలల నుంచి జనాన్ని తరలించి సభ పెట్టడం సిగ్గుచేటు
● ఎమ్మెల్యే స్వామి మరుగుదొడ్ల అవినీతిపై చర్చకు సిద్ధమా..?
● విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

పొన్నలూరు: కొండపి నియోజకవర్గంలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ షో అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఎద్దేవా చేశారు. పొన్నలూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం నుంచి రాత్రి వరకు అలుపెరగకుండా ప్రజా సంకల్ప పాదయాత్ర చేపట్టి గ్రామాల్లోని రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజల విన్నపాలు, వారి జీవన స్థితిగతులను క్షుణంగా తెలుసుకున్నారన్నారు. దాని ప్రతిఫలమే నేడు రాష్ట్ర ప్రజలు సంక్షేమ పథకాలు పొంది అభివృద్ధి చెందడానికి దోహదపడిందన్నారు. కానీ లోకేష్ ఉదయం నుంచి సాయంత్రం వరకు నిద్రపోయి..గ్రామాల్లో ప్రజలు విశ్రాంతి తీసుకునే సమయంలో పాదయాత్ర చేయడం హాస్యాస్పదమన్నారు. ప్రతి నియోజకవర్గంలో రెండు రోజులు..రోజూ రెండు గంటల పాటు తిరిగి ఆ తరువాత రెండు వైపుల తడికలు కట్టిన ప్రదేశంలో సభ నిర్వహించి ప్రభుత్వంపై పస లేని ఆరోపణలు చేస్తూ ఎల్లో మీడియా ద్వారా అసత్య ప్రచారం చేయించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సమస్యలను తెలుసుకోకుండా లోకేష్ సెల్ఫీలు దిగడం, బొండాలు తినటం, ముందుగానే తన సిబ్బందితో సినిమా సెట్టింగ్‌లతో ఆర్భాటాలు చేయడం తప్ప యువగళం పాదయాత్ర వల్ల ఒరిగిందేమి లేదన్నారు. లోకేష్ పాదయాత్రను నియోజవర్గ ప్రజలు పట్టించుకోలేదని అందుకనే సభకు జిల్లా నలుమూలల నుంచి టీడీపీ కార్యకర్తలకు డబ్బులు, మందు, భోజనం ఏర్పాటు చేసి బస్సుల్లో తీసుకొచ్చారన్నారు.

కొండపి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

కొండపి నియోజకవర్గ ప్రజలతో మూడు సార్లు ఓట్లు వేయించుకున్న ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని జన్మభూమి కమిటీలతో నీరు చెట్టు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, రోడ్ల నిర్మాణ పనుల్లో భారీగా అవినీతికి పాల్పడి ప్రజల సొమ్మును నిలువునా దోచేశాడన్నారు. చివరికి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 15 వేల మరుగుదొడ్లను నిర్మించకుండా రూ. 32 కోట్ల బిల్లులు నొక్కేశాడన్నారు. ఎమ్మెల్యే స్వామికి కమీషన్లు ముట్టచెప్పలేక సంగమేశ్వరం ప్రాజెక్టు కాంట్రాక్టర్ పనులు వదిలి పారిపోయాడన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణ అంచనాలను రూ.206 కోట్లకు పెంచి రీ టెండరింగ్‌కు సిద్ధం చేశామని, త్వరలోనే అడ్డంకులన్నీ తొలగి పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే రూ.110 కోట్లతో వందేళ్ల నాటి ఓవీ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరింప చేశామన్నారు. స్వామి సొంత గ్రామమైన తూర్పు నాయుడు పాలెంలోని ఎస్సీ, ఎస్టీలు నీళ్ల కోసం అల్లాడుతుంటే రామతీర్థం జలాశం నుంచి పైప్ లైన్ ద్వారా వచ్చే నీటిని స్వామి తన ఇంటికి, దామచర్ల సత్య కంపెనీలకు మళ్లించుకొని గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దమ్ముంటే లోకేష్ జిల్లా దాటిపోయే లోపు ఎమ్మెల్యే స్వామి అవినీతిపై బహిరంగ చర్చకు రావాలని అశోక్‌బాబు సవాల్ విసిరారు. 2024 ఎన్నికల్లో తప్పక ఎమ్మెల్యే స్వామి అహంకారాన్ని కూలదీసి కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, సింగరాయకొండ వైఎస్ ఎంపీపీ రవికుమార్‌రెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు చింతపల్లి హరిబాబు, పల్లపోలు బాలకోటిరెడ్డి, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి డిజిటల్ అసిస్టెంట్ తొలగింపు

బేస్తవారిపేట: బేస్తవారిపేట-2 గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూ ప్రస్తుతం కంభం సచివాలయం-1లో డిప్యూటేషన్‌పై ఉన్న దండు శ్వేతను ఉద్యోగం నుంచి తొలగిస్తూ అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. డిజిటల్ అసిస్టెంట్ శ్వేత వికలాంగుల కోటలో తప్పుడు వికలాంగత్వ సర్టిఫికెట్ పొందుపరిచి ఉద్యోగం పొందారని కలెక్టర్ ఆమెను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ చెన్నకేశవరెడ్డి నిర్ధారించారు.